

అపార్ నమోదు వేగవంతం చేయండి: డీఈవో

గరుగుబిల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అపార్ నమోదును వేగవంతం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి నల్ల చినతిరుపతినాయుడు అన్నారు. గురువారం మండలంలోని సన్యాసిరాజుపేట పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధకనపర్చాలని ఉపాధ్యాయులకు సూచించారు. నిబంధనల మేరకు మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వహించాలన్నారు. పరిసరాలు పరిశుభ్రతతో పాటు బడి తోటలను ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట ఎంఈవో దత్తి అప్పలనాయుడు, తదితరులు ఉన్నారు.

నిధులూ పరిశోధనలూ లేవు!



వ్యవసాయ పరిశోధన కేంద్రం

- సీతంపేట వ్యవసాయ పరిశోధన కేంద్రంపై గత వైసీపీ సర్కారు నిర్లక్ష్యం
- ఐదేళ్లలో రూపాయి కూడా ఇవ్వలే
- శాస్త్రవేత్తలకు తప్పని ఇబ్బందులు
- వేధిస్తున్న సిబ్బంది కొరత
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు



ఒకప్పుడు ఆ పరిశోధన కేంద్రంలో నిధులు పుష్కలంగా ఉండేవి. శాస్త్రవేత్తలు కొత్తకొత్త పరిశోధనలు చేసేవారు. ఎన్నో నూతన వరి వంగడాలను సృష్టించేశారు. భూ సార పరీక్షలను సైతం నిర్వహించేవారు. రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించేవారు. అలాంటి కేంద్రాన్ని గత వైసీపీ సర్కారు తీవ్ర నిర్లక్ష్యం చేసింది. ఐదేళ్లలో ఒక్కరూపాయి కూడా విదల్చలేదు. ఇప్పుడు ఆ కేంద్రం నిధుల లేమితో కొట్టుమిట్టాడుతోంది. పరిశోధనలు దేవుడెరుగు సిబ్బందికి వేతనాలు ఇచ్చుకోలేని స్థితికి దిగజారింది. ఇదీ సీతంపేట వ్యవసాయ పరిశోధన కేంద్రం పరిస్థితి. కూటమి ప్రభుత్వంలో ఈ పరిశోధన కేంద్రానికి పూర్వవైభవం వస్తుందని శాస్త్రవేత్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సీతంపేట రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సీతంపేటకు కూత వేటు దూరంలోని పాత పనుకువలస వద్ద 1986లో వ్యవసాయ పరిశోధన కేంద్రాన్ని 43 ఎకరాల విస్తీర్ణంలో నెలకొల్పారు. గతంలో ఈ కేంద్రంలో అనేక పరిశోధనలు జరిగేవి. రానురాను నిధుల లేమి కారణంగా పరిశోధనలు మందగించాయి. గిరిజన ప్రాంతాల్లో అనుకూలమైన విత్తనోత్పత్తికి సంబంధించిన పరిశోధనలు ఆశించిన స్థాయిలో జరగడం లేదు. ప్రస్తుతం కేంద్రంలోని 43 ఎకరాలకు గాను ఈ ఏడాది 10 ఎకరాల్లో ఎంటీయూ 1061 రకానికి చెందిన వరి పంటను వేశారు. ఐదు ఎకరాల్లో కట్టిజనుము సాగు చేస్తున్నారు. బంతిపూలను కూడా సాగు చేసి విక్రయిస్తున్నారు. అలాగే కందిపంటపై కూడా ప్రయోగాలు చేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2014-19లో ఈ పరిశోధన కేంద్రానికి రూ.25 లక్షల వరకు నిధులు కేటాయించారు. దీంతో గిరిజన ప్రాంతాల్లో అనుకూలమైన పంటలు, పంట సరళి, నీరు పుష్కలంగా లేని గ్రామాల్లో పరిశోధన, సేద్య విభాగంలో సస్యపోషణ వంటి పరిశోధనలు జరిగాయి. దీనివల్ల గిరిజన రైతులకు ఎన్నో లాభాలు చేకూరాయి. 2017లో ఆత్మ పథకం కింద గిరిరాజ కోళ్ల పెంపకం ప్రయోగాత్మకంగా చేపట్టారు. ఈ కోళ్ల నుంచి వచ్చే వ్యర్థాలతో చేపల పెంపకం కూడా చేపట్టారు. అలాగే ఐటీడీఏ నుంచి కూడా నిధులు మంజూరయ్యేవి. దీనివల్ల పరిశోధనలకు ఎలాంటి ఆటంకాలు ఉండేవి కావు. అయితే, వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత 2019-24 మధ్య ఈ కేంద్రానికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. దీనివల్ల ఐదేళ్ల పాటు ఎటువంటి పరిశోధనలు చేయలేని పరిస్థితి శాస్త్రవేత్తలకు ఏర్పడింది. ఓటు ఆన్ బడ్జెట్ నుంచి ఉన్న నిధులు మాత్రమే ఇంతవరకు ఖర్చు పెట్టారు.

సిబ్బంది కొరత

పరిశోధన కేంద్రానికి సిబ్బంది కొరత వేధిస్తుంది. ముగ్గురు శాస్త్రవేత్తలు అవసరం కాగా ఇద్దరే ఉన్నారు. సోయిల్‌సైన్స్ ఎక్స్‌టెన్షన్‌ల విభాగాలకు సంబంధించి శాస్త్రవేత్తలు లక్ష్మీనారాయణ, పి.సౌజన్య విధులు నిర్వహిస్తున్నారు. గుమస్తా, అటెండర్, వాచ్‌మన్‌తో పాటు టైం స్కేల్ వర్కర్లు ఐదుగురు మాత్రమే పనిచేస్తున్నారు. బడ్జెట్ కేటాయింపులు లేని కారణంగా పరిశోధనలకు అవసరమైన మ్యాన్ పవర్‌ను వినియోగించు కోలేక పోతున్నారు. కాంట్రాక్ట్ ప్రాతిపదికన సిబ్బందిని తీసుకుంటే వారికి వేతనాలు ఇచ్చే పరిస్థితి లేదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ పరిశోధన కేంద్రంలో మరిన్ని ప్రయోగాలు జరగాలంటే కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలని కోరుతున్నారు.



పరిశోధన కేంద్రంలో ప్రయోగాత్మకంగా పండిస్తున్న కట్టిజనుము

నిధులు ఇవ్వాలి

గతంలో నిధులు పుష్కలంగా ఉండేవి. దీని మూలంగా పరిశోధనలు కూడా జరిగేవి. ప్రస్తుతం నిధులు లేక పరిశోధనలు చేయలేకపోతున్నాం. ప్రస్తుతం పాడి, కట్టి జనుము, బంతిపూలు, పశువుల పెంపకం వంటివి చేస్తున్నాం. ప్రభుత్వం నుంచి నిధులు పుష్కలంగా వస్తే రైతులకు ఉపయోగపడే మరిన్నీ పరిశోధనలు చేస్తాం.

-లక్ష్మీనారాయణ, శాస్త్రవేత్త, వ్యవసాయ పరిశోధన కేంద్రం, సీతంపేట

'వట్టిగెడ్డ' పనులు ప్రారంభించండి

- బిల్లులకు ఢోకా లేదు
- రిజర్వాయర్‌ను పరిశీలించిన ఇంజనీర్ల బృందం



వట్టిగెడ్డ ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఇంజనీర్ల బృందం

జియ్యమ్మవలస, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వట్టిగెడ్డ రిజర్వాయర్ పనులను డిసెంబరు లోగా ప్రారంభించాలని కమేండింగ్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ) ఇంజనీర్ల బృందం ఆదేశించింది. ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల పర్యటనలో భాగంగా గురువారం సాయంత్రం జిల్లాలోని వట్టిగెడ్డ రిజర్వాయర్‌ను ఈ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా కడ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్.మోహనరావు, ఎస్ఈ సుగుణాకరరావు మాట్లాడుతూ.. జైకా నిధులతో ప్రాజెక్టు పనులు త్వరగా ప్రారంభించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. బిల్లులకు ఎటువంటి ఢోకా లేదని అన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో నీరు లేని కారణంగా పనులను త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలని తెలిపారు. ఇంతవరకు జరిగిన పనులను వారు పరిశీలించి, మరింత నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. వారి వెంట డీఈ రవికుమార్, జైకా టెక్నికల్ ఇంజనీర్ సబ్‌జాన్, సాయిలక్ష్మి కనస్ట్రక్షన్ ప్రాజెక్టు మేనేజర్ మోహన్‌బాబు, ఏఈ జీవీ రఘు ఉన్నారు.

వెంగళరాయసాగర్ సందర్శన..

మక్కువ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శంబర గ్రామ సమీపంలోని వెంగళరాయసాగర్ ప్రాజెక్టును కడ బృందం గురువారం సందర్శించింది. కుడి ప్రధాన కాలువపై చేపట్టిన లైనింగ్ పనులను పరిశీలించింది. సువర్ణముఖి స్పిల్‌వే రెగ్యులేటర్‌ను పరిశీలించి గతంలో చేసిన పనులపై వివరాలు అడిగి తెలుసుకుంది. వెంగలరాయసాగర్ ప్రాజెక్టు ఆధునీకీకరణకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరుకు కృషి చేస్తున్నట్టు బృందం తెలిపింది. బిల్లుల బకాయిలు చెల్లింపుల్లో గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో పనులు మధ్యలో విడిచిపెట్టినట్టు కాంట్రాక్టర్ తెలిపాడు. కార్యక్రమంలో జైకా రాష్ట్ర కో-ఆర్డినేటర్ సబ్‌జాన్, మోహన్‌రావు, ప్రాజెక్టు ఈఈ ఆర్.అప్పలనాయుడు, ఎస్ఈ సురేష్, డీఈఈపీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గోనె సంచులు సిద్ధం

- ధాన్యం సేకరణ కోసం సమకూరుస్తున్న అధికారులు
- పీఏసీఎస్ కేంద్రాలకు తరలింపు

గరుగుబిల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌కు సంబంధించి జిల్లాలో ధాన్యం సేకరణకు అవసరమైన గోనె సంచులను అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఈ సంచులను ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు తరలించే పనిలో నిమగ్నమయ్యారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా 21,97,230 సంచులను సమకూరుస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ధాన్యం సేకరణకు అవసరమైన గోనె సంచులు లేక రైతులు పలు అవస్థలు ఎదుర్కొన్నారు. గత సమస్యలు పునరావృతం కాకుండా ఉండేందుకు, అధికారులు మిల్లర్ల నుంచి సంచులను సేకరించి పీఏసీఎస్‌లకు ప్రత్యేక వాహనాల్లో తరలిస్తున్నారు. అవసరమైన గోనె సంచులను సమకూర్చే బాధ్యతను సంబంధిత మిల్లర్లకే అప్పగించారు. చిరిగిన సంచులు లేకుండా చూడాలని తహసీల్దార్లకు జాయింట్ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. పీఏసీఎస్‌ల నుంచి రైతుసేవా కేంద్రాలకు సంచులను తరలించే బాధ్యతను వీఆర్వోలకు అప్పగించారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి 183 కేంద్రాలను ఏర్పాటు చేసి తాత్కాలిక సిబ్బందిని ఇప్పటికే నియమించారు. వీరికి అవసరమైన శిక్షణ అందించారు. ధాన్యం సేకరణకు 93 మిల్లులను కూడా గుర్తించారు. రైతులకు అవసరమైన సుమారు 21,97,230 గోనె సంచులను కూడా సమకూరుస్తున్నారు.

ఇంకెప్పుడు కొనుగోలు చేస్తారు?

జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఇంకా ప్రారంభంకాకపోవడంతో రైతులు తమ పంటను వ్యాపారులకు విక్రయించి నష్టపోతున్నారు. మన్యం జిల్లాలోని 15 మండలాల పరిధిలో ఈ ఏడాది సుమారు 1.66 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. 3.25 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా దిగుబడులు వస్తాయని అధికారులు అంచనా వేశారు. ప్రస్తుతం చాలాచోట్ల వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే 1121, 1244 వంటి తేలికపాటి రకాల వరిని రైతులు నూర్పు చేస్తున్నారు. అయితే, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో వారు దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది. వాస్తవానికి వరి మద్దతు ధర క్వింటాకు సాధారణ రకం రూ. 2,300, గ్రేడ్-ఏ రూ. 2,320 ఉంది. అంటే 80కేజీలకు సుమారు రూ.1,840 వరకూ రైతుకు అందాల్సి ఉంది. కానీ, వ్యాపారులు మాత్రం తక్కువకు కొనుగోలు చేస్తున్నారు. తడి ధాన్యమని చెబుతూ తరుగుపేరిట 5 నుంచి 8కేజీల వరకూ అధికంగా కొలుస్తున్నారు. బస్తాకు రూ.1,450 నుంచి రూ.1,500వరకు ధర చెల్లిస్తున్నారు. దీంతో రైతులు వేలాది రూపాయల నష్టాన్ని వారు భరించాల్సి వస్తుంది. ఇప్పటికైనా జిల్లాలో త్వరితగతిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.



గరుగుబిల్లిలోని ఓ మిల్లులో గోనె సంచులను పరిశీలిస్తున్న తహసీల్దార్ జయ, ఆర్ఐ (ఫైల్)

పంచాయతీలు ఆదర్శంగా ఉండాలి

- రాష్ట్రంలోనే అగ్రస్థానానికి చేరుకోవాలి
- జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు

జియ్యమ్మవలస, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని పంచాయతీలు ఆదర్శవంతంగా ఉండి రాష్ట్రంలోనే అగ్రస్థానానికి చేరుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు అన్నారు. గురువారం జియమ్మవలస మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత కార్యదర్శులపై ఉందన్నారు. ప్రతీ పంచాయతీ స్వర్ణ పంచాయతీగా ఆవిర్భవించాలని అన్నారు. పాలక మండలి సభ్యుల వివరాలు, పంచాయతీ ఆస్తులు, తదితర వివరాలు నమోదు చేయాలని పేర్కొన్నారు. తద్వారా రానున్న రోజుల్లో ఆయా గ్రామ పంచాయతీ ప్రజలకు అసెస్‌మెంట్ నంబరు వస్తుందని వివరించారు. దోమలు వృద్ధి చెందకుండా దోమల మందును ప్రతీ వీధిలో స్ప్రే చేయాలని సూచించారు. దోమలు వృద్ధి చెందితే మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. మురుగు నీరు కాలువల్లో నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరచి చుట్టూ బ్లీచింగ్ చల్లాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా నోడల్ బి.రామగోపాల్, ఎంపీడీవో రమేష్, గ్రామ సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు

ఎన్నికల షెడ్యూల్ మారింది

- 5న నీటి సంఘం ఎన్నికలకు నోటిఫికేషన్
- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ వెల్లడి

పార్వతీపురం/టౌన్/పాలకొండ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్ మారిందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు సంబంధిత అధికారులతో గురువారం టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. మారిన షెడ్యూల్ ప్రకారం డిసెంబరు 5వ తేదీన టీసీ, డబ్ల్యూయూఏ, డిస్ట్రిబ్యూటరీ కమిటీ, ప్రాజెక్టు కమిటీల ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేస్తామని తెలిపారు. అదే రోజు ఏయే ప్రాంతాల్లో ఎన్నికలు జరుగుతాయో తెలియజేస్తామన్నారు. గ్రామాల్లో నీటి సంఘాల ఎన్నికలపై దండోరా వేయించాలని ఆదేశించారు. '8వ తేదీన టీసీల ఎన్నికల ప్రక్రియ చేపడతాం. ఎంపికైన టీసీలు ఆ నీటి సంఘం పరిధిలోని చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకుంటారు. ఎన్నికైన నీటి సంఘ చైర్మన్, వైస్‌చైర్మన్లు అదే రోజు మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టుపై నోటిఫికేషన్ ఇస్తారు. 11న డిస్ట్రిబ్యూటరీ కమిటీని ఎన్నుకుంటారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లకు అదే రోజు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ ఎన్నికపై సమాచారం ఇవ్వనున్నారు. 14న డిస్ట్రిబ్యూటరీ కమిటీ, ప్రాజెక్టు కమిటీ చైర్మన్లు ఎన్నుకుంటారు. ఎన్నికల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలి'. అని అధికారులకు ఆదేశించారు.



మాట్లాడుతున్న కలెక్టర్

గురువుకు గుడి..

- ఆధ్యాత్మిక కేంద్రంగా విశ్వనాథ గురు నిలయం
- ఏడాది పొడవునా పూజలు
- అయ్యప్ప మాలధారులకు స్థానం



6లో

ఇక.. ఆ నిబంధనకు చెల్లు

- స్థానిక సంస్థల్లో పోటీకి సంతానం అడ్డుకాదు
- పిల్లలు ఇద్దరు కన్నా అధికంగా ఉన్నా పర్లేదు
- గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన కూటమి ప్రభుత్వం

6లో



ఇక ఎప్పుడైనా పింఛను

- మూడునెలలకోసారి తీసుకునే అవకాశం

6లో

ఇలా.. ఎలా గడిపేది?

● చలిలో వసతిగృహ విద్యార్థుల కష్టాలు

భోగాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇటు చల్లని నేల. అటు వణికించే చలి. ఇరుకిరుకు గది. ఆ గదిలో 70 మంది విద్యార్థులు. రాత్రి వేళ చల్లగా ఉంటుందనే భయంతో మామూలు నేలపై కాలు పెట్టడానికే సంకోచించే పరిస్థితి. అలాంటి నేలపై రాత్రంతా నిద్రపోవాల్సి వస్తే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఇదీ భోగాపురంలోని బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థుల దుస్థితి. ఇక్కడ వసతిగృహంలో ఐదు నుంచి పదో తరగతి వరకు 70 మంది విద్యార్థులు చదువుతున్నారు. గతంలో ఉన్న భవనం శిథిలమవడం... అద్దె భవనం దొరక్కపోవడంతో... స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలోని ఓ గదిలో వీరందరికీ వసతి సౌకర్యం కల్పించారు. అందులోనే గోడలకు ఆనుకొని సామాన్లు ఉంచుతూ...ఆ మధ్యలో విద్యార్థులు ఉంటున్నారు. ఆ ఇరుకు ప్రదేశంలో 70 మంది ఒకేచోట చదువుకుంటూ... రాత్రయితే ఒకేచోట చల్లని నేలపై నిద్రిస్తూ అవస్థలు పడుతున్నారు. తమ బిడ్డలు చదువుకొని ప్రయోజకులవుతారని ఆశించి.. వసతిగృహంలో ఉంచుతున్న తల్లిదండ్రులు... ఈ చిన్నారుల పరిస్థితి చూసి తల్లడిల్లుతున్నారు. అంతమంది మధ్యలో పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు ఎలా సన్నద్ధమవుతారన్నది అధికారులకే తెలియాలి.



భోగాపురం వసతి గృహంలో నేలపై నిద్రిస్తున్న విద్యార్థులు

ఉద్యోగాల సృష్టి ఎంత వరకు వచ్చింది?



శాసనసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం టౌన్/బెలగాం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన జిల్లాల్లో ఉద్యోగాల సృష్టి ఎంతవరకు వచ్చిందనే విషయం తెలియజేయాలని ఎమ్మెల్యే విజయచంద్ర శాసనసభలో ప్రశ్నించారు. గురువారం శాసనసభ సమావేశాల్లో వివిధ అంశాలపై ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 8 వెనుకబడిన జిల్లాలు ఉన్నట్లు గుర్తించారని తెలిపారు. ఆ జిల్లాల్లో విద్య, వైద్యం, ఉద్యోగ సృష్టి, విద్యుత్, తాగునీరు తదితర అంశాల అభివృద్ధికి కృషి జరగాల్సి ఉందన్నారు. అందులో భాగంగా వెనుకబడిన జిల్లాల్లో ఉద్యోగ సృష్టి ఎంత వరకు జరిగిందనే నివేదికలు స్పష్టంగా ఉండాలని ఎమ్మెల్యే అభిప్రాయ పడ్డారు. సోషల్ ఎకనామిక్ ఎన్విరాన్మెంట్ సర్వేలో వెనుకబడిన జిల్లాల్లో ఏ కార్యక్రమం చేపడితే ఉపయోగం ఉంటుందో ఆలోచిస్తే అందరికీ ఉపయుక్తంగా ఉంటుందని అన్నారు. ఇప్పటికీ కొన్ని గ్రామాలకు విద్యుత్ సౌకర్యం లేదని వివరించారు. ఉపాధి, ఉద్యోగ సృష్టి జరిగితే వెనుకబడిన ప్రాంతాలకు ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు.

రాజాం.. విభిన్న వర్గాల సంగమం

● భిన్న సంస్కృతుల సమ్మేళనం



తాండ్రపాపారాయుడు



రాజాం రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి):

రాజాం.. బొబ్బిలిపులి తాండ్ర పాపారాయుడు నడయాడిన నేల. పాలించిన వీరగడ్డ. ఇక్కడే కోటలో ఉండి... బొబ్బిలి రాజుల కార్యకలాపాలను నడిపించిన ధీశాలి. బొబ్బిలి కోటను ధ్వంసం చేసిన విజయరామరాజును హతమార్చిన ధీరుడు. తనవారంతా పోయారన్న బాధతో ఒంటరితనాన్ని భరించలేక ఆత్మహత్యకు పాల్పడిన సున్నిత మనస్కుడు. ఇవన్నీ ఓ కోణం కాగా.. తాండ్ర పాపారాయుని శౌర్యం నిండిన రాజాంలో విభిన్న కులాలు, భిన్న సంస్కృతులు మరోకోణం.. అవేంటో చూద్దాం రండి.

సామాజిక వర్గాలు ఇలా...

తాండ్ర పాపారాయుడు పద్మనాయక వెలమ వంశీయుడని చరిత్ర చెబుతోంది. రాజవంశీయులైన పద్మనాయక వెలమలతో పాటు రాజాంలో తెలగాలు, సేనాపతులు, కాపులు, యాదవులు, హరిజనులు, వైశ్యులు ఉన్నారు. రథ, గజ, తురగ దళాలలో నైపుణ్యం కలిగినవారు తెలంగాణ నుంచి బొబ్బిలి, విజయనగరం ప్రాంతాలకు వచ్చి స్థిరపడ్డారు. వారి సంతతి ఇప్పటికీ గుర్రాల, ఏనుగుల, ఏనుగుతల వంటి ఇంటిపేర్లతో కొనసాగుతున్నారు. తెలంగాణ నుంచి వచ్చిన వారు కాలక్రమంలో తెలగాలుగా మార్పుచెందారు. ఇప్పటికీ వీరు తెలంగాణలో ప్రసిద్ధి చెందిన బోనాల పండుగను చేస్తుంటారు.

సేనాధిపత్యం పుచ్చుకొని...

కోల్‌కత్తాలో బ్రిటిష్ వారి వద్ద మందుగుండు పేల్చడంలో నిష్ణాతులైన వారు రాజాం కోటకు రాగా.. ఆనాటి రాజులు వారికి సేనాధిపత్యాన్ని అప్పగించారు. వారు కోటకు పడమర, దక్షిణ దిక్కులలో ఉండేవారని చారిత్రక సమాచారం. అనంతర కాలంలో వారి వృత్తికి ప్రాధాన్యం తగ్గిపోవడంతో వారంతా దేవాంగుల పేరుతో చేనేతవృత్తిని స్వీకరించి రాజాం పట్టణ, పరిసర గ్రామాలలో స్థిరపడ్డారు. రెండేళ్లకోమారు రాజాంలో నిర్వహించే రాజాం-సారధి గ్రామ దేవతల ఉత్సవాలు తరతరాలుగా పెదసేనాపతి, చినసేనాపతి కుటుంబాల ఆధ్వర్యంలోనే నిర్వహించడం ఆనవాయితీ. దశాబ్దాల కాలం నుంచి కోటకు కాపుగా (రక్షణ) ఉన్న జాతులు కాలక్రమంలో తూర్పుకాపులుగా స్థిరపడ్డారు. తొలుత వ్యవసాయానికే పరిమితమైన కాపులు కాలక్రమంలో అన్నిరంగాల్లోనూ ముందంజలో ఉన్నారు. తొలిరోజుల్లో గొర్రెల పెంపకంతోనే జీవనం సాగించే యాదవులు కాలక్రమంలో ఆ వృత్తితో పాటు ఇతర వ్యవహారాలలో కూడా రాణిస్తున్నారు. పట్టణంలో గణనీయంగా ఉన్న ఎస్సీలు సైతం ఉద్యోగ, వ్యాపార, రాజకీయ రంగాలలో రాణిస్తున్నారు. తరతరాలుగా గ్రామాలలో నివసించే వైశ్యులు అనంతర కాలంలో రాజాం చేరి వర్తక, వాణిజ్య, వ్యాపార, పారిశ్రామికవేత్తలుగా దూసుకుపోతున్నారు. ఉన్నత హోదాలలో స్థిరపడ్డారు.

కొసమెరుపు..

తాండ్రపాపారాయుడి వంశీయులు తమ సోదరి మల్లమ్మ దేవికి బొబ్బిలి యుద్ధ సమయంలో... కష్టకాలంలో ఆదుకోలేకపోయినందున చెల్లికి కానివారని నిందను భరించాల్సి వచ్చింది. కాలక్రమంలో వారంతా చెలికాని వారుగా పిలవబడ్డారని పెద్దలు చెబుతారు. రాజాం, బొబ్బిలి ప్రాంతాలో ఉన్న పద్మనాయక వెలమలలో చెలికాని ఇంటిపేరున్న వారే అధికం.



రాజాంలోని పాపారాయుడి కోట

ఇక ఎప్పుడైనా పింఛను

● మూడునెలలకోసారి తీసుకునే అవకాశం



సాలూరు రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సామాజిక పింఛనుదారులకు శుభవార్త. ఇకపై మూడు నెలలకోసారి పింఛను తీసుకోవచ్చు. గత ప్రభుత్వ హయాంలో ఒక నెలలో ఎవరైనా స్థానికంగా అందుబాటులో లేకపోతే ఆ నెలకు సంబంధించిన పింఛను అందుకునే అవకాశం కోల్పోయేవారు. దీని వల్ల ఆర్థికంగా ఇబ్బందులు పడేవారు. సీఎం చంద్రబాబు చొరవతో ఇకపై ఇలాంటి కష్టాలకు చెక్ పడనుంది. ఇకపై మూడు నెలలకొకసారి కూడా తమ పింఛను డబ్బులు బకాయిలతో (నాగాలు)తో కలపి ఒకేసారి తీసుకోవచ్చు. ఈ మేరకు సెర్ప్ సీఈవో వీరపాండ్యన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. దీనికి సంబంధించిన విధివిధానాలను జారీ చేశారు. మూడు నెలలకొకసారి పింఛను చెల్లింపు విధానం 2014-2019 మధ్య టీడీపీ ప్రభుత్వంలో అమలైంది. గత ప్రభుత్వంలో ఈ విధానానికి స్వస్తి పలికి ఏ నెల పింఛను ఆ నెలలోనే తీసుకోవాలనే నిబంధన తెచ్చారు. ఏ కారణం చేతనైనా ఎవరైనా అందుకోలేకపోతే ఆశలు వదులుకోవాల్సి వచ్చేది. తాజాగా కూటమి ప్రభుత్వ నిర్ణయంతో ఇటువంటి సమస్యలకు తెర పడనుంది. పార్వతీపురం మన్యం జిల్లాలో 1.42 లక్షల మంది సామాజిక పింఛనుదారులు ఉన్నారు. వారంతా 14 రకాల సామాజిక పింఛన్లు పొందుతున్నారు. వీరిలో దాదాపు 13,500 మంది ఇతర ప్రాంతాల్లో ఉంటున్నట్టు అంచనా. పింఛను ఇచ్చే సమయానికి వారంతా ఆదరాబాదరాగా స్వగ్రామాలకు వస్తున్నారు. ఇకపై మూడు నెలకొకసారి వస్తే సరిపోతుంది. కొత్త విధానం ప్రకారం తొలి నెల పింఛను తీసుకోకుంటే బకాయితో కలిపి మరుసటి నెల ఇస్తారు. ఇలా మూడు నెలల వరకు అవకాశం ఉంటుంది. మూడో నెల కూడా పింఛను తీసుకోకపోతే సంబంధిత వ్యక్తి శాశ్వతంగా వలస వెళ్లినట్టుగా భావించి నిలిపివేయనున్నారు. పింఛను పునరుద్ధరణకు పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్లు, మండలాల్లో ఎంపీడీవోలను కలవాల్సి ఉంటుంది. అటువంటి పింఛను పునరుద్ధరించినా 3 నెలలవి కలిపి ఇవ్వరు. అందువల్ల మూడు నెలల్లోగా తమ సామాజిక పింఛనును బకాయిలతో కలసి పొందాల్సి ఉంటుంది. మూడు నెలలకొకసారి పింఛను ఇవ్వడానికి కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో సామాజిక పింఛనుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గురువుకు గుడి..

● ఆధ్యాత్మిక కేంద్రంగా విశ్వనాథ గురు నిలయం

● ఏడాది పొడవునా పూజలు ● అయ్యప్ప భక్తులకు స్థానం



రాజాంలోని విశ్వనాథ గురు నిలయం

రాజాం రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తనకు అయ్యప్ప మాలధారణ చేసిన గురువుకి గుడి నిర్మించారాయన. అందులో గురువు చిత్రపటాన్ని ఏర్పాటు చేసి ఏడాది పొడవునా పూజలు చేస్తున్నారు. ఏటా అక్టోబరులో పెద్దసంఖ్యలో అయ్యప్ప మాలలు వేయిస్తూ.. 45 రోజులు వారి వెన్నంటే ఉంటూ శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీక్షానంతరం వారికి ఇరుముడులు కట్టి శబరిమల కొండకు తీసుకు వెళ్తున్నారు. ఇటు గురుసేవ, అటు స్వామి సేవలో తరిస్తున్నారు. ఆయనే పట్టణంలోని విశ్వనాథ గురు నిలయం (శాస్తా సమాజం) పీఠాధిపతి ఉమాపతిశేషు గురుస్వామి.



విశ్వనాథ గురు నిలయంలో పడిపూజ (ఫైల్)

దశాబ్దాల కిందట...

1974 ప్రాంతంలో రాజాం ప్రాంతానికి చెందిన వారంతా దివంగత పొట్నా కృష్ణమూర్తి గుప్త సారథ్యంలో బొబ్బిలిలో విశ్వనాథ గురుస్వామి వద్ద మాలధారణ చేసేవారు. ఏటా దీక్షాధారుల సంఖ్య పెరగడంతో 1982లో విశ్వనాథ గురుస్వామి రాజాంలో అయ్యప్ప మాలధారణకు శ్రీకారం చుట్టారు. 1986 నుంచి ఇక్కడ అయ్యప్ప సేవలు జోరందుకున్నాయి. విశ్వనాథ గురుస్వామి శిష్యులు, పొట్నా కృష్ణమూర్తి గుప్త, ఉమాపతిశేషు సారథ్యంలో 2011లో అయ్యప్ప మందిరం నిర్మించారు. విశ్వనాథ గురు నిలయంగా రూపుదిద్దుకున్న దీనిలో అయ్యప్ప పీఠానికి ఇరువైపులా రామమందిరం, విశ్వనాథ గురు స్వామి మందిరం ఏర్పాటు చేశారు. ఏడాది పొడవునా మందిరంలో పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. విశ్వనాథ గురుస్వామి జయంతి, వర్ధంతి వేడుకలను నిర్వహిస్తున్నారు. అక్టోబరు మూడోవారం నుంచి డిసెంబరు మొదటివారం వరకూ సుమారు 45 రోజుల పాటు అయ్యప్ప దీక్షాధారులతో మందిరంలో ఆధ్యాత్మికత వెల్లివిరుస్తుంది.

ప్రత్యేకం.. పడిపూజ

ఏటా అయ్యప్ప స్వామి పడిపూజ ఇక్కడి ప్రత్యేకం. 18 మెట్లను ఏర్పాటుచేసి శాస్త్రోక్తంగా శబరిమల తరహాలో పడిపూజ చేస్తారు. ఏటా స్వామి వారికి 1500 వందల లీటర్ల పాలతో విశేష అభిషేకం చేస్తుంటారు.

ఈ స్థానం గురువుదే..



ఈ జీవితం స్వామిదే.. చివరి ఊపిరి ఉన్నంత వరకూ స్వామిసేవలోనే ఉంటా. గురువు స్థానం చాలా గొప్పది. అందుకే స్వామి పక్కనే గురువుకి మందిరం నిర్మించాం.


-ఉమాపతి శేషు

ఇక.. ఆ నిబంధనకు చెల్లు

● స్థానిక సంస్థల్లో పోటీకి సంతానం అడ్డుకాదు

● పిల్లలు ఇద్దరు కన్నా అధికంగా ఉన్నా పర్లేదు

● గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన కూటమి ప్రభుత్వం



రాజాం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి):

'ఒకరు ముద్దు.. ఇద్దరు హద్దు.. ముగ్గురు వద్దు'... గత 30 సంవత్సరాలుగా వినిపించిన నినాదం ఇది. జనభా నియంత్రణకు ప్రజల్లోకి ప్రభుత్వాలు ఈ నినాదాన్ని బలంగా పంపించాయి. జనాభా నియంత్రణకు చట్టాలు కూడా తీసుకొచ్చాయి. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, స్థానిక సంస్థల్లో పోటీకి అభ్యంతరాలు.. ఇలా ఒకటేమిటి చాలా రకాలుగా చేశాయి. దేశంలో జనాభా నియంత్రణను అరికట్టే క్రమంలో ఈ ప్రయోగాలు ఫలించాయి. కానీ దక్షిణాది రాష్ట్రాల్లో జనాభ వృద్ధిరేటు తగ్గిపోవడం ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్రంలో కూడా ఈ ప్రభావం ఉంది. పిల్లల పుట్టుక తగ్గడంతో.. యువత సంఖ్య తగ్గుతోంది. అయితే నడివయస్కులు, వృద్ధుల సంఖ్య ఒకేసారి పెరగడంతో ఆ ప్రభావం అభివృద్ధిపై పడుతోంది. అందుకే ఏపీ సీఎం చంద్రబాబు తరచూ ఒక ప్రకటన చేస్తున్నారు. పిల్లలు కనండి అని పిలుపునిస్తున్నారు. అయితే ప్రపంచీకరణలో భాగంగా యువత తగ్గుముఖం పట్టడంతోనే చంద్రబాబు ఈ పిలుపు ఇస్తున్నారు. మన దేశంలో ఉత్తరాది రాష్ట్రాలతో పోల్చుకుంటే దక్షిణాదిలో జనాభా తగ్గుతున్నారు. ముఖ్యంగా ఏపీలో ఈ సంఖ్య చాలా తక్కువగా ఉంది. అందుకే ప్రభుత్వం మేల్కొంది. స్థానిక సంస్థల్లో పోటీకి ఇద్దరు పిల్లలు కన్నా ఎక్కువగా ఉంటే అనర్హులన్న నిబంధనను తొలగించింది. ఈ మేరకు అసెంబ్లీలో గురువారం బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించింది.

అప్పట్లో పటిష్ఠ చర్యలు..

జనాభా పెరుగుదలను నియంత్రించేందుకు 1994లో టీడీపీ ప్రభుత్వం పటిష్ఠ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి ఇద్దరు కంటే ఎక్కువ పిల్లలున్నవారిని అనర్హులుగా తేల్చింది. ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చింది. 30 సంవత్సరాల కిందట దేశ జనాభా రికార్డుస్థాయిలో పెరిగింది. అప్పటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కీలక నిర్ణయాలు తీసుకున్నాయి. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు జరిపించాయి. అయితే 1994లో ఏపీ పంచాయతీరాజ్ చట్టాన్ని అనుసరించి ఇద్దరు పిల్లలు కంటే ఎక్కువ ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అనర్హులుగా చట్టం తీసుకొచ్చారు. 1994 మే నెల కంటే ముందు ఇద్దరు పిల్లలు కంటే ఎక్కువ ఉంటే అనర్హులుగా తేల్చారు. అప్పట్లో ఈ నిబంధన కలకలం రేపింది. ఎంతో మంది రాజకీయ ఆశావహులపై నీళ్ల చల్లింది. ఇప్పుడు దానికి తెరదించుతూ కూటమి ప్రభుత్వం ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నా స్థానిక సంస్థల్లో పోటీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

● చివరి సారిగా 2011లో జనగణన జరిగంది. అప్పటి ఉమ్మడి జిల్లాను అనుసరించి జిల్లా జనాభా 23.44 లక్షలు. 2021లో జరగాల్సిన జన గణన కొవిడ్ ప్రభావంతో వాయిదా పడింది. మరోసారి జనగణన జరిపేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధం అవుతోంది. జనాభా వృద్ధి రేటు ఆధారంగా సెన్సస్ ఆపరేషన్ డైరెక్టర్ ఒక అంచనాను విడుదల చేసింది. దీని ప్రకారం 2021లో 24.20 లక్షలు. 2022లో 24.36 లక్షలు, 2023లో 24.40 లక్షలు, 2024లో 24.48 లక్షల జనాభా ఉంటుందని అంచనా వేసింది. అయితే ఏడాదికేడాదీ జనాభా స్వల్ప సంఖ్యలో పెరుగుతోంది. అయితే పుట్టుకలు తగ్గుతుండడంతో భవిష్యత్తులో యువత సంఖ్య తగ్గి నడివయస్సులు, వృద్ధులు పెరిగే పరిస్థితి ఉంది. అందుకే రాష్ట్ర ప్రభుత్వాలు ఆందోళన చెందుతున్నాయి

● శుభ పరిణామం..

స్థానిక సంస్థల్లో పోటీకి సంతానం అర్హతగా నిలవడంతో అప్పట్లో చాలామంది ఆశావహులపై నీళ్ల చల్లినట్టు అయింది. గ్రామ ప్రథమ పౌరుడిగా సేవలందించాలని చాలామంది భావించారు. కానీ అప్పట్లో అదో అడ్డంకిగా నిలిచింది. అప్పట్లో జనాభా పెరుగుదలను నియంత్రించేందుకు అలా చేశారు. ఇప్పుడు జనాభా పెరుగుదల కోసం అర్హతను రద్దుచేయడం శుభ పరిణామం.

-వంగ గోవిందరావు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు

● అప్పట్లో భయపడేవారు..

అప్పట్లో గ్రామాలకు వచ్చి జనాభా నియంత్రణ ఆపరేషన్లు చేసేవారు. కానీ దానిని ఒక అపవాదుగా చూసేవారు. అధికారులను చూసి మహిళలు పొలాల్లోకి పరుగుపెట్టేవారు. కానీ కాలంతో పాటు చాలారకాలుగా మార్పులు వచ్చాయి. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లకు మహిళలే స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారు. అయితే ఇప్పుడు ప్రభుత్వమే పిల్లలు కనండి అనిచెబుతుండడం వింతగా ఉంది.

-గంటా బాపానాయుడు, వృద్ధుడు, కొప్పర కొత్తవలస, వంగర మండలం

న్యూస్ బాక్స్

ధాన్యం కొనుగోలుపై శిక్షణ

జామి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఉన్న ఎంపీడీవో కార్యాలయంలో ధాన్యం సేకరణపై శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఏవో కిరణ్‌కుమార్, సీహెచ్‌డీటీ మూర్తి ఆధ్వర్యంలో వరి తేమ శాతం, నాణ్యత పరీక్షల గురించి వ్యవసాయ సహాయకులు, డేటా ఎంట్రీ ఆపరేటర్స్, సాంకేతిక సహాయకులకు వివరించారు.

దళిత సమస్యలు పరిష్కరించండి

చీపురుపల్లి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ నిర్వహించ తలపెట్టిన పోస్టు కార్డు ఉద్యమాన్ని విజయవంతం చేయాలని ఆ సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటాన అప్పారావు కోరారు. తమ సమస్యల్ని పోస్టు కార్డు ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలియజేయాలన్న లక్ష్యంతో రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు ఈ ఉద్యమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ మేరకు పోస్టర్‌ను ఆయన గురువారం చీపురుపల్లిలో ఆవిష్కరించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అంబేడ్కర్ చిత్ర పటాన్ని ఏర్పాటు చేయాలని పోస్ట్ కార్డుల ద్వారా కోరినట్టు అప్పారావు తెలిపారు.

మండల స్థాయి పోటీల్లో ప్రతిభ

భోగాపురం, నవంబరు21(ఆంధ్రజ్యోతి): జాతీయ రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని విద్యాశాఖ ఆధ్వర్యంలో మండలస్థాయిలో నిర్వహించిన పోటీల్లో పలువురు విద్యార్థులు ప్రథమ స్థానంలో విజేతలుగా నిలిచారు. వ్యాసరచన పోటీల్లో భోగాపురం హైస్కూల్‌కు చెందిన డి.శిరీష, వి.పల్లవి, వక్తృత్వంలో ఏపీ మోడల్‌స్కూల్‌కు చెందిన జి.వర్షిత, క్విజ్‌లో తూడెంకు హైస్కూల్‌కు చెందిన పి.రమ ప్రథమ స్థానం సాధించారు. విద్యార్థులు ఈనెల 22న జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీలో పాల్గొనున్నారని ఎంఈవో-2 చంద్రమౌళి తెలిపారు.

ప్రారంభమైన 'దోమలపై దండయాత్ర'

శృంగవరపుకోట రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన శృంగవరపుకోట పంచాయతీ పరిధిలో సర్పంచ్ గనివాడ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో ఈవో అనురాధ ఆధ్వర్యంలో దోమలపై దండయాత్ర కార్యక్రమం గురువారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక వాహనం ఏర్పాటుచేసి, దానికి ఫాగింగ్ యంత్రం బిగించారు. ప్రతిరోజు పట్టణంలో వున్న పలు ప్రాంతాల్లో ఫాగింగ్ చేయిస్తామని తెలి పారు.

23, 24న ఓటర్ల నమోదు కార్యక్రమం

నెల్లిమర్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈ నెల 23, 24 తేదీల్లో మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటర్ల నమోదు, అభ్యంతరాల స్వీకరణకు సంబంధించి ప్రత్యేక కార్యక్రమం చేపడుతున్నట్లు తహసీల్దార్ బి.సుదర్శనరావు, ఎన్నికల విభాగం డీటీ వీవీఆర్ జగన్నాథరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రెండు రోజుల్లో బీఎల్వోలు ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో అందుబాటులో ఉంటారని ప్రజలు, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

24న చెస్ పోటీలు

విజయనగరం టౌన్, నవంబరు21(ఆంధ్రజ్యోతి): శ్రీ చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం, ఫైర్ చెస్ స్కూల్ ఆధ్వర్యంలో ఈ నెల 24న జిల్లాస్థాయి ఓపెన్ చెస్ పోటీలు నిర్వహించనున్నామని శ్రీ చెస్ అసోసియేషన్ కార్యదర్శి కె.వి.జ్వాలాముఖి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ విభాగంలో విజేతగా నిలిచిన వారికి రూ. 5 వేలు నగదు బహుమతి అందించడం జరుగుతుందని తెలిపారు. అండర్ 7, 9, 11, 13, 15 విభాగాల్లో విజేతలకు ప్రత్యేక బహుమతులు అందిస్తామని, వివరాలకు 95734 15618 నంబర్లో సంప్రదించాలన్నారు.

అథ్లెటిక్స్ రాష్ట్ర కోచ్‌గా లీలాకృష్ణ

విజయనగరం టౌన్, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో ఈ నెల 26 నుంచి 30 వరకు జరగనున్న అండర్- 17 జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు కోచ్‌గా పనుపాం జెడ్పీ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ పి.లీలా కృష్ణను నామినేట్ చేస్తూ కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నుంచి ఉత్తర్వులు వచ్చాయి.

పోస్టల్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

భోగాపురం, నవంబరు21(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పోస్టల్‌శాఖ అందిస్తున్న సేవలను ప్రజలు, ఖాతాదారులు వినియోగించుకుని సద్వినియోగం చేసుకోవాలని భోగాపురం సబ్‌పోస్టుమాస్టర్ పి.శ్రీనివాసరావు అన్నారు. మండలం భోగాపురం గ్రామంలో పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసు ఆదేశాల మేరకు గురువారం పోస్టల్ సేవలపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిదారులకు తమ ఖాతాల్లో నగదు పడే విధంగా ఇండియన్ పోస్టల్ బ్యాంకు ఖాతాలు ప్రారంభించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీఎం సుందరనాయుడు, జగన్నాథరావు, బ్రాంచ్ బీపీఎంలు, సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీపై మార్గదర్శకాలు

లక్కవరపుకోట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా ప్రజలకు అందిస్తున్న సామాజిక పింఛన్ల పంపిణీలో కొత్త మార్గదర్శకాలు గురువారం విడుదల చేసింది. ఏ కారణం చేతనైనా ఒక నెల పింఛను తీసుకోకపోతే వచ్చేనెలలో రెండు నెలల పింఛను అందించాలి, ఒకవేళ రెండో నెల కూడా తీసుకోకపోతే మూడో నెలలో పింఛను అందజేయాలని గైడ్‌లైన్స్ జారీ చేసింది. వరుసగా మూడు నెలలు తీసుకోకపోతే పింఛను నిలుపుదల చేస్తారన్నారు.

మెయిన్ సెంటర్లుగా మార్పు చేయాలి

▶▶ అంగన్‌వాడీ కార్యకర్తలు కలెక్టరేట్ వద్ద ఆందోళన



కలెక్టరేట్ వద్ద ఉన్న నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేస్తూ వెంటనే జీవో ఇవ్వాలని అంగన్‌వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు గురువారం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్ నిర్వాహకులకు పని భారం పెరిగిందని, మినీ వర్కర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని జీవో ఉన్నప్పటికీ సక్రమంగా అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగలేదన్నారు. మినీ వర్కర్లకు వేసవి సెలవులు మంజూరు చేయాలన్నారు. మినీ వర్కర్లతో సమానంగా వేతనాలు మంజూరు చేయాలన్నారు. గ్రేడ్ 2 సూపర్‌వైజర్ పోస్టులకు మినీ వర్కర్లుకు అవకాశం కల్పించాలని కోరారు. 42 రోజులు సమ్మె మినిట్స్ కాపీని అమలు చేయాలని కోరారు. సర్వీసులో చనిపోయిన వారికి మట్టి ఖర్చులు వెంటనే అమలు చేయాలన్నారు. అనంతరం డీఆర్వో శ్రీనివాస మూర్తికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పైడిరాజు, అనసూయ, వి.లక్ష్మి, జ్యోతి తదితరులు ఉన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తిచేయండి

● హౌసింగ్ పీడీ కూర్మినాయుడు



సంకిలిలో గ్రామీణ ఇళ్లను పరిశీలిస్తున్న పీడీ

రాజాం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న గృహనిర్మాణాలు మార్చి 25 నాటికి పూర్తిచేయాలని జిల్లా గృహనిర్మాణ శాఖ అధికారి ఎస్ కూర్మినాయుడు ఆదేశించారు. గురువారం మండలం పొగిరి గ్రామంలో జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. మండలంలో 3900 వరకు గృహాలు మంజూరైతే ఇంతవరకు 860 వరకు పూర్తిచేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. నిర్మాణాల్లో జాప్యం జరిగితే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జగనన్న లేఅవుట్లలో కూడా పూర్తి స్థాయిలో పనులు జరగడం లేదని దీనికి కారణం సిబ్బంది నిర్లక్ష్యమేనన్నారు. ఏఈ వేణుగోపాలరావు, సిబ్బంది ఉన్నారు.

రేగిడి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస్‌యోజన కింద గ్రామీణ ఇళ్లను త్వరగా పూర్తిచేయాలని, బిల్లుల పెండింగ్ సమస్య రానివ్వమని జిల్లా హౌసింగ్ శాఖ పీడీ కుర్మినాయుడు లబ్ధిదారులకు సూచించారు. ఇంటి నిర్మాణాల్లో లక్ష్యాలు చేరుకోవాలని ఆయన సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. సంకిలిలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను ఆయన గురువారం పరిశీలించారు. ఇక్కడ 26 ఇళ్లు మంజూరు కాగా, కొన్ని నత్తనడకన ఉండటం, కొన్ని బీబీఎల్‌స్టేజ్ దాటకపోవటంతో ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సంకిలి సర్పంచ్ బి.పట్టాబి, స్థానిక వర్క్ఇన్‌స్పెక్టర్ శివ, నారాయణరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ జ్యోతిప్రసాద్ తదితరులు ఉన్నారు.

రామతీర్థంలో ఘనంగా పూర్ణాహుతి



యాగశాలలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న దృశ్యం

నెల్లిమర్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం రామస్వామి వారి దేవస్థానంలో పుష్యమి నక్షత్రం పురస్కరించుకుని యాగశాలలో సుందర కాండ హవనం, పూర్ణాహుతి కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. దేవాలయంలో ప్రాతఃకాలార్చన, బాలభోగం తర్వాత యాగశాలలో ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత ఆస్థాన మండపంలో ఉత్సవమూర్తులకు నిత్య కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమాలను దేవస్థానం ఈవో వై.శ్రీనివాసరావు పర్యవేక్షించగా అర్చకులు ఖండవిల్లి సాయిరామాచార్యులు, కిరణ్‌కుమార్, గొడవర్తి నరసింహచార్యులు, పాణంగిపల్లిప్రసాద్, పవన్‌కుమార్, రామ్‌గోపాల్ తదితరులు నిర్వహించారు.

పారిశుధ్య కార్మికుల జీతాలు చెల్లించాలి



ఎస్.కోట ఎంపీడీవో కార్యాలయం ముందు నిరసన

శృంగవరపుకోట రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన శృంగవరపుకోట ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో పట్టణ, మండలంలో ఉన్న పారిశుధ్య కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. గురువారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ మూడు నెలల నుంచి 15 నెలల పాటు పెండింగ్‌లో ఉన్న జీతాలను త్వరగా చెల్లించాలని కోరారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం



యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఇదే

రాజాం నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం రాజాం డివిజన్ స్వర్ణోత్సవ మహాసభల వేదికపై రాజాం మండల శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహన్‌రావు, జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు రమేష్, చంద్ర పట్నాయక్, ఈశ్వరరావు ఎన్నికల అధికారులుగా, జిల్లా కార్యదర్శులు బి రామినాయుడు, పక్కి వాసు ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించగా నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవమైంది. మండల శాఖ గౌరవాధ్యక్షుడిగా రామినాయుడు, అధ్యక్షుడిగా మువ్వల రమేష్, సభ్యులు తదితరులు నియమితులయ్యారు. జిల్లా బాధ్యులు ప్రమాణ స్వీకారం చేయించారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికలు



రాష్ట్రస్థాయి కోకో పోటీలకు ఎంపికైన గరికివలస విద్యార్థినులు

గుర్ల, నవంబర్ 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు గరికివలస జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు నడుపూరు కుసుమ, మండల ధనలక్ష్మీలు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్టు పీఈటీ మల్లిఖార్జునరావు తెలిపారు. పలనాడు జిల్లా కారంపూడిలో ఈ నెల 23నుంచి రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ పోటీలకు విద్యార్థుల ఎంపిక పట్ల హెచ్‌ఎం శ్రీదేవి హర్షం వ్యక్తం చేశారు.

విద్య, వైద్య రంగంపై అవగాహన

విజయనగరం దాసన్నపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉత్తమ పౌర సమాజ స్థాపనకు అంధవిశ్వాసాలకు వ్యతిరేకంగా ఆవిర్భవించిన జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగం, శాస్త్రీయ దృక్పథం వంటి ఎన్నో అంశాలపై అవగాహన చేపడుతున్నామని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు డాక్టరు పైలా రమేష్‌రాజు అన్నారు. జిల్లా అధ్యక్షుడు ఎరుకొండ ఆనంద్ ఆధ్వర్యంలో నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ నెల 23న ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ వందలాది మంది విద్యార్థులకు సామాజిక అవగాహన-జీవన నైపుణ్యం అనే అంశాలపై ఒక్క రోజు శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఉద్యోగ పోటీలకు సిద్ధపడేవారు డిగ్రీ, ఇంజినీరింగు విద్యార్థులకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో వేదిక ప్రతినిధులు శివాజీ, షన్ముఖరావు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకల రైతులను ఆదుకోవాలి

విజయనగరం రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గొర్రెలు, మేకల రైతులను ఆదుకోవాలని జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మన్యాల కృష్ణ జిల్లా కలెక్టరు అంబేద్కర్‌ని కోరారు. ఈ మేరకు గురువారం ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. విజయనగరం జిల్లా జామి మండలం యాతపాలెంలో మేత మేస్తుండగా, కుక్కల సంచారం కన్పించడంతో మేకలు, గొర్రెలు భయపడి వెళ్లిన నేపథ్యంలో జరిగిన ప్రమాదంలో మేకలు, గొర్రెలు చనిపోయాయని దీని వల్ల ఆయా రైతులకు నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. గొలగాని సింహాచలం, గొలగాని గౌరీ, వారాది రమణమ్మ, గొంప బంగారు నాయుడు తదితర రైతులకు చెందిన గొర్రెలు, మేకలకు సంబంధించి ప్రమాదం జరిగిన తీరును పోలీసు యంత్రాంగం కూడా నమోదు చేసిన నేపథ్యంలో. ప్రభుత్వం తరుపున వారికి న్యాయం చేయాలని కోరారు. అదే విధంగా వర్షం, పిడుగుపాటు, రోడ్డు, రైలు ప్రమాదాలు కారణంగా గొర్రెల కాపరులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గొర్రెలు, మేకలకు ప్రభుత్వం ఏడాది పొడవునా బీమా సౌకర్యం కల్పించాలని కోరారు.

మిడతాన రవి బాధ్యతల స్వీకరణ



మిడతాన రవిని అభినందిస్తున్న జనసేన నాయకులు

విజయనగరం (ఆంధ్రజ్యోతి), నవంబరు 21: రాష్ట్ర కొప్పలవెలమ కార్పొరేషన్ డైరక్టర్‌గా మిడతాన రవికుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన రవికుమార్‌ని జనసేన గజపతినగరం నాయకులు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నాపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానన్నారు.

గురువు లేకుంటే శూన్యమే

రాజాం రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గురువు విలువ వెలకట్టలేనిదని రాజాం శాస్త్రాసమాజం (విశ్వనాథ గురునిలయం) పీఠాధిపతి ఉమాపతి శేషు గురుస్వామి స్పష్టం చేశారు. ఏడు దశాబ్దాల క్రితం అయ్యప్ప దీక్షల్ని రాజాం ప్రాంతానికి పరిచయం చేసి రాజాం ప్రాంతీయుల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన దివంగత విశ్వనాథ గురుస్వామి వర్ధంతిని పురస్కరించుకుని శాస్త్రాసమాజంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన అయ్యప్ప దీక్షాధరులని ఉద్దేశించి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. విశ్వనాథ గురుస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సన్నిధానంలో ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు.

డైరెక్టర్‌గా ప్రమాణస్వీకారం చేసిన శ్రీలక్ష్మి

జామి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వెలమకార్పొరేషన్ డైరక్టర్‌గా ఎంపికైన మండలంలోని రామయ్యపాలెం మాజీ సర్పంచ్ మాకిరెడ్డి శ్రీలక్ష్మి గురువారం అమరావతిలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, మాజీ జడ్పీటీసీ బండారు పెదబాబు ఉన్నారు.

మంత్రిని కలిసిన తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్

గజపతినగరం నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ గుంట్రోతు గోవింద గురువారం అమరావతిలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. డైరెక్టర్‌గా ఎన్నికయిన గోవిందను సాలువా కప్పి అభిందించారు. పార్టీ అప్పగించిన బాధ్యతను మరింత ముందుకు తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ మంత్రి, జనసేనపార్టీ పీఏసీ సభ్యురాలు పడాల అరుణ, టీడీపీ నియోజకవర్గ నాయకులు శీరం రెడ్డిరాం కుమార్, శీరం రెడ్డి చంద్రశేఖర్, ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లైంగిక దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి



ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నిరసన తెలియజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విజయనగరం దాసన్నపేట, నవంబరు 21: విశాఖ సిటీలో లా విద్యార్థినీపై లైంగిక దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కో-కన్వీనరు భారతీ డిమాండ్ చేశారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని నగర కమిటీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలో రోజు, రోజుకీ అత్యాచార ఘటనలు పెరిగి పోతున్నాయన్నారు. విశాఖలో లా విద్యార్థినీ, ప్రేమ పేరుతో వంచించి అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వీరికి కారణమైన డ్రగ్స్, మత్తు పదార్థాలను రాష్ట్రంలో నిరోధించాలని, ప్రభుత్వం ఆ దిశగా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అత్యాచారానికి గురైన విద్యార్థినీ కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని ఆ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు రాము, రవికుమార్, రమేష్, శిరీషా, రాజు, రాహుల్, సోమేష్, కుమారస్వామి, మురళీ తదితరులు పాల్గొన్నారు.

సారా తయారీ కేంద్రాలపై దాడి

విజయనగరం క్రైం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని జామి మండలం కనకలవారి కళ్లాల్లో గురువారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంటు సిబ్బంది సారా తయారీ కేంద్రాలపై దాడిచేసి, 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ఎన్‌ఫోర్సుమెంటు సీఐ ఇందిరాదేవి తెలిపారు. అసిస్టెంట్ కమిషనర్ రామచంద్రరావు ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్సుమెంటు వింగ్ ఎస్‌కోట, విజయనగరం సర్కిల్-2 టీంలు ఈ దాడుల్లో పాల్గొని సామగ్రిని స్వాధీనం చేసుకున్నాయి. ఈ దాడుల్లో ఎస్‌కోట సీఐ సీహెచ్ రాజేష్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా పశువుల తరలింపు

నెల్లిమర్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఆవులను తరలిస్తున్న వాహనాన్ని నెల్లిమర్ల పూడమ్మ ఆలయ పరిసరాల్లో పోలీసులు గురువారం సీజ్ చేశారు. సుమారు 8 ఆవులను హింసిస్తూ తరలిస్తున్న ఆ వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు ఆవులను గోశాలకు తరలించినట్లు ఎస్ఐ బి.గణేష్ తెలిపారు. ఆవులను తరలిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేశామన్నారు.

వేధిస్తున్నాడంటూ భర్తపై ఫిర్యాదు

సంతకవిటి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తనను, పిల్లల్ని తన భర్త తూతిక త్రిమూర్తులు రెండేళ్లుగా మానసికంగా హింసిస్తున్నాడని రాజాం మున్సిపాలిటీ పరిధిలోని మారుతీనగర్‌కు చెందిన తూతిక జ్యోతి సంతకవిటి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనను వదిలేసి మరో మహిళతో జీవనం సాగిస్తున్నాడని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. ఎస్.ఐ.గోపాలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సబ్బన్నపేటలో..

భోగాపురం, నవంబరు21(ఆంధ్రజ్యోతి): మండలం సబ్బన్నపేట గ్రామానికి చెందిన మల్లేడు రమణపై భార్య మల్లేడు ఆదిలక్ష్మి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. తనకు 13 ఏళ్లక్రితం వివాహమైందని, ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారన్నారు. అయితే గత కొన్ని రోజులుగా భర్త తనను అనుమానిస్తూ వేధిస్తున్నాడని, వేధింపులు భరించలేకపోతున్నాని ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.సూర్యకుమారి తెలిపారు.

పాఠశాలలో చోరీ

లక్కవరపుకోట, నవంబరు21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని విజ్ఞాన భారతి పాఠశాలలో బుధవారం రాత్రి చోరీ జరిగినట్లు ప్రధానోపాధ్యాయులు లక్ష్మీప్రసన్న తెలిపారు. బుధవారం సాయంత్రం పాఠశాల ముగిసిన తరువాత తాళాలు వేశామని, గురువారం ఉదయం వచ్చి చూస్తే తలుపులు, కిటికీలు తెరచి ఉన్నాయని చెప్పారు. పాఠశాలకు సంబంధించిన పుస్తకాలు, ఆట వస్తువులు, ఇతర సామగ్రి చిందరవందరగా చేసి వెళ్లిపోయారని తెలిపారు. చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

టూరిజం అభివృద్ధిపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం టూరిజం అభివృద్ధిపై దృష్టి సారించి తద్వారా ఆర్థికంగా బలపడాలని విజయనగరం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు కోరారు. గురువారం శాసన మండలిలో ఆయన మాట్లాడుతూ ఇతర ఆదాయ మార్గాలతో పాటు రాష్ట్రంలో అనేక చోట్ల టూరిజంను అభివృద్ధి పరిస్తే ప్రజలకు ఆహ్లాదంతో పాటు ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని ఆ దిశగా మంత్రి దృష్టిసారించాలని, దానికి తమ సహకారం ఎప్పుడు ఉంటుందన్నారు.

నగరంలో కమిషనర్ పర్యటన

విజయనగరం రింగురోడ్డు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా గురువారం నగరంలోని వివిధ ప్రాంతాలను నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య సందర్శించి సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు చేశారు. బొంకుల దిబ్బ, కోట ప్రాంతాల్లో విక్రయాలు చేస్తున్న కూరగాయ వర్తకులకు చెత్తాచెదారాలను ప్రధాన రహదారిలో వేయకుండా డస్ట్‌బిన్‌లను ఉపయోగించాల న్నారు. గుమ్చీ ప్రాంతంలో పర్యటించి అక్కడ కాలువ అపరిశుభ్రంగా ఉండడంతో తక్షణమే కాలువల్లో ఉన్న చెత్తాచెదారాలను ప్రక్షాళన చేయాలని సిబ్బందికి ఆదేశించారు. టిఫిన్ దుకాణాల్లో ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని గమనించి తక్షణమే అపరాధ రుసుం విధించాలని పారిశుధ్య పర్యవేక్షకులకు ఆదేశించారు. గుణుపూరు పేట రహదారిపై చెత్త రాకుండా నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి 'శివానందలహరి' పై ప్రవచనం

నెల్లిమర్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్లలోని రామకృష్ణ ధ్యాన మందిరంలో ఈనెల 23 నుంచి 29 వ తేదీ వరకు ప్రతి రోజు సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు ఆదిశంకరాచార్యులు రచించిన శివానందలహరి పై చిన్మయ మిషన్ ప్రతినిధి స్వామి విజయానంద సరస్వతి ప్రవచనం చేస్తారని రామకృష్ణ సేవా సమితి ప్రతినిధి జగన్నాధరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఈ నెల 30 సాయంత్రం ఆరు గంటలకు సామూహిక ప్రత్యేక కార్తీక దీపోత్సవం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమాలకు ఆధ్యాత్మిక ప్రియులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని జగన్నాధరాజు సూచించారు.

ఘనంగా ప్రపంచ టెలివిజన్ వేడుకలు

భోగాపురం, నవంబరు21(ఆంధ్రజ్యోతి) మండలం ముక్కాం సమీప మిరాకిల్ ఎడ్యుకేషనల్ సొసైటీ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్‌లో గురువారం ప్రపంచ టెలివిజన్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అర్జునరావు మాట్లాడుతూ టెలివిజన్ సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక ప్రభావాన్ని గుర్తించడం, ప్రజల జీవితాల్లో ఆవిష్కరించిన మార్పులపై అవగాహన కలిగించేదని వివరించారు. విద్య, వినోదం, సమాచార రంగాల్లో వచ్చిన విప్లవాత్మక మార్పులను వివరించారు. టెలివిజన్ ప్రజల మధ్య మానవతా విలువలు, నూతన సాంకేతికలు, విద్యార్థులకు మరింత పరిశోధన చేయటానికి ప్రేరణనిస్తాయన్నారు. అనంతరం టెలివిజన్ ప్రాముఖ్యత, చరిత్రపై విద్యార్థులు నిర్వహించిన ప్రోజెక్టులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

గజపతినగరం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆసుపత్రిలో గురువారం శ్రీ సాయిరాం సేవా దినోత్సవం సందర్భంగా రోగులకు పండ్లు రొట్టెలను పంపిణీ చేశారు. సాయిరాం సేవా సమితి సభ్యులతో పాటు ఆసుపత్రి సూపరింటెండెంట్ జగదీష్ పంపిణీ చేశారు. అనంతరం నిరుపేదలకు దుప్పట్లు అందించారు.

జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలి

● ఘనంగా అంతర్జాతీయ మత్స్యకార దినోత్సవం



మత్స్యకారులకు కూలింగ్ బాక్సులు పంపిణీ చేస్తున్న పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏ పీవోలు

పార్వతీపురం/టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానికంగా ఉన్న వనరులను ఉపయోగించుకుని జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలని ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ మత్స్యకారులను కోరారు. గురువారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన అంతర్జాతీయ మత్స్యకార దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. సాంకేతికంగా వేటకు సంబంధించి శిక్షణను తీసుకునే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. తోటపల్లి రిజర్వాయర్ లైసెన్స్ మంజూరుకు దరఖాస్తులు అందాయని, సమగ్ర నివేదికలు అందించాలని సంబంధిత శాఖాధికారులను కోరారు. అనంతరం సీతంపేట ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్‌తో కలిసి మత్స్యకారులకు కూలింగ్ బాక్సులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార శాఖాధికారులు పాల్గొన్నారు.

జీవో36 ప్రకారం వేతనాలు ఇవ్వాలి

పాలకొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పాలకొండ నగర పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న ఇంజినీరింగ్ కార్మికులకు జీవో-36 ప్రకారం వేతనాలు చెల్లించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ కమిటీ గౌరవ అధ్యక్షుడు దావాల రమణారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావుకు గురువారం వినతిపత్రం అందించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో యూనియన్ ప్రతినిధులు వై.హరిబాబు, ఉమామహేశ్వరరావు, టి.ఈశ్వరరావు, పి.సతీష్, పి.వేణు, సీహెచ్ సంజీవి ఉన్నారు.

రహదారి పనులకు నిధులు మంజూరు

గరుగుబిల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం నుంచి పాలకొండ ప్రధాన రహదారి అభివృద్ధి పనులకు రూ.1.50 కోట్లు నిధులు మంజూరయ్యాయని రహదారులు భవనాల శాఖ జేఈ వి.రామ్‌మోహనరావు గురువారం తెలిపారు. ఈనెల 20న ఆంధ్రజ్యోతిలో రహదారి సమస్యలపై వచ్చిన కథనంపై అధికారులు స్పందించారు. గోతులను పూడ్చేందుకు అవసరమైన టెండర్లను ఆహ్వానించామని ఆయన తెలిపారు. టెండర్ పూర్తయిన తర్వాత పనులు ప్రారంభిస్తామని చెప్పారు. నెల రోజుల్లో పనులు పూర్తి చేస్తామన్నారు. ఉల్లిభద్ర ప్రాంతంలో తోటపల్లి కుడి ప్రధాన కాలువపై నిర్మించిన ప్రధాన కల్వర్టుకు ఇరువైపులా రక్షణ గోడల నిర్మాణంతో పాటు అవసరమైన పనులకు ప్రతిపాదనలు చేశామని తెలిపారు. నిధులు మంజూరు కాగానే ప్రధాన కల్వర్టుల పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

ఆ ఒప్పందాలను రద్దు చేయాలి

సాలూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అదాని అవినీతి నేపథ్యంలో సాలూరులో చేసుకున్న ఒప్పందాలను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎన్‌వై నాయుడు, మండల కార్యదర్శి ఎం.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక విలేకర్లతో సమావేశం నిర్వహించారు. సాలూరు మండలంలో కురుకూటి ప్రాంతంలో ఆరు గ్రామాల పరిధి 750 ఎకరాలు అదాని పవర్ ప్రాజెక్టు కోసం కేటాయించారని, దీనిని సీపీఎం గతంలో వ్యతిరేకిస్తూ ఆందోళన చేపట్టిందని తెలిపారు. విశాఖపట్నంలోని డేటా సెంటర్‌ను రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు. అదాని కోసం రాష్ట్రంలో కేటాయించిన భూములన్నీ వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

భామిని, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): భామిని మండల కేంద్రంలో ప్రభుత్వమే పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసిన రైతులకు ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. గురువారం భామిని వచ్చిన ఆయన రైతులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీఐ ధర క్వింటా పత్తి రూ.7,520గా ఉందన్నారు. దళారులు సిండికేట్ అయి పత్తి ధర తగ్గిపోతుందని ప్రచారం చేస్తున్నారని అన్నారు. మండలంలోని ఐదు వేల ఎకరాల పత్తి సాగు అవుతున్నా రైతులు ఇబ్బందులు ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలువురు ఇళ్లల్లో నిల్వ ఉన్న పత్తిని పరిశీలించారు. స్థానిక రైతులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

గరుగుబిల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సచివాలయాల సిబ్బంది విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా ప్రత్యేకాధికారి బి.రామ్‌గోపాలరావు అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందించేలా దృష్టి సారించాలన్నారు. ప్రజల నుంచి సిబ్బందిపై ఫిర్యాదులు వస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.పైడితల్లి, ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, ఏవో ఎన్.అర్జునరావు, బి.రవిరామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

జిల్లాకు పేరు తీసుకు రావాలి

పార్వతీపురం/ టౌన్, నవంబరు 21: క్రీడా పోటీల్లో జిల్లాకు రాష్ట్ర స్థాయి పోటీల్లో పేరు తీసుకు రావాలని డీఈవో ఎన్.తిరుపతినాయుడు అన్నారు. ఈనెల 23వ తేదీ నుంచి 25వ తేదీ వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ కరాటే పోటీలకు జిల్లా నుంచి వెళ్తున్న విద్యార్థులను గురువారం స్థానిక డీఈవో కార్యాలయం వద్ద ఆయన అభినందించారు. జిల్లా నుంచి కరాటే పోటీలకు 4 బాలురు, 8 మంది బాలికలు రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్తున్నారని, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. క్రీడాకారులతో పాటు ఐదుగురు వ్యాయామ ఉపాధ్యాయులు మేనేజర్లుగా వ్యవహరిస్తారన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

సీతంపేట రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గురుకులాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న దీక్షలు కొనసాగుతున్నాయి. ఐటీడీఏ కార్యాలయం ప్రధాన గేటు ఎదురుగా గురువారం రెండో రోజు నిర్వహించిన దీక్షా శిబిరాన్ని గిరిజన సంఘం నాయకులు ఎం.తిరుపతిరావు, లక్ష్మణరావు సందర్శించి, మద్దతు తెలిపారు. ఉద్యోగుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.

టైలర్ల కుటుంబానికి ఆర్థిక సాయం

పాలకొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఇటీవల కొత్తలంక నాగేశ్వరరావు, సిప్పాడ వెంకటరమణ అనే టైలర్లు అనారోగ్యంతో మృతిచెందగా, వారి కుటుంబాలకు టీడీపీ పట్టణ అభివృద్ధి కమిటీ చైర్మన్ పల్లా కొండలరావు సాయం అందించారు. ఆయా కుటుంబాలను గురువారం పరామర్శించి, రూ.10వేలు చొప్పున సాయం చేశారు.

వైభవంగా శోభా యాత్ర

కురుపాం, నవంబరు21(ఆంధ్రజ్యోతి): కురుపాంలో నూతనంగా నిర్మించిన అయ్యప్ప దేవాలయ ప్రారంభోత్సవంలో భాగంగా గురువారం స్వామివారి మూల విరాట్, పూర్ణ కళశాలతో శోభా యాత్ర నిర్వహించారు. అయ్యప్ప స్వాములు, మహిళలు పాల్గొన్నారు.



కళశాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

ఇది చెరువే!

● ఆక్రమణలో చిలకాం పల్లపు బంద

● వరి పంటతో దర్శనమిస్తున్న వైనం



చిలకాంలో ఆక్రమణకు గురైన పల్లపుబందలో వరి పంటను సాగు చేస్తున్న దృశ్యం

గరుగుబిల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈ చిత్రం చూశారా.. వరి పొలం కనిపిస్తోంది కదా.. కానీ నిజానికి ఇది ఒక చెరువు. కానీ దాని ఆనవాళ్లే కనపించకుండా కబ్జా చేసి, వరి సాగు చేసుకుంటున్నారు. ఇది గరుగుబిల్లి మండలంలోని చిలకాం రెవెన్యూ పరిధిలోని ఓ చెరువు దుస్థితి. చిలకాం గ్రామంలోని పల్లపు బందను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు 2014లో ఉపాధి నిధులకు ప్రతిపాదనలు చేశారు. ఈమేరకు రూ.7,65,590 నిధులు మంజూరయ్యాయి. ఉపాధి కూలీలకు వేతనాల రూపంలో రూ.4,26,418 వ్యయం చేశారు. చెరువును అభివృద్ధి చేశారు. అంతవరకు బాగానే ఉంది. కానీ ఆ తర్వాత దానిపై పర్యవేక్షణ లేకపోవడంతో ఉపాధి నిధులతో అభివృద్ధి చేసిన ఈ చెరువులో ప్రస్తుతం నీరుకు బదులు వరి పంట దర్శనమిస్తోంది. దిగువ ఆయకట్టు రైతులకు సాగునీరు కల్పించాలనే ఉద్దేశంతో ఈ చెరువును అభివృద్ధి చేస్తే.. కొంతమంది రైతులు మాత్రం దీనిని ఆక్రమించి, వరి సాగు చేస్తున్నారు. సాగునీటి సరఫరాకు ఆటంకం కలిగిస్తున్నారు. మండలంలో చాలా చోట్ల ఇదే పరిస్థితి ఉందని పలువురు ఆరోపిస్తున్నారు.

ఆక్రమణలు తొలగింపజేస్తాం

దీనిపై ఎంపీడీవో జి.పైడితల్లిని వివరణ కోరగా చెరువు ఆక్రమణపై తహసీల్దార్‌కు సమాచారం అందించామని చెప్పారు. ఆక్రమణలు తొలగించి రైతుల నుంచి ఖర్చు అయిన మొత్తాలను జమ చేసేలా చర్యలు చేపట్టాలని కోరామని తెలిపారు.

వీడీవీకేలను బలోపేతం చేయాలి

● ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సీతంపేట రూరల్, నవంబరు21(ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ పరిధిలో ఉన్న వీడీవీకేలను బలోపేతం చేయడానికి చర్యలు తీసుకోవాలని పీవో సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం వెలుగు ఏపీఎంలతో నిర్వహించిన సమావేశంలో ఆయన జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వీడీవీకేలోల చేపడుతున్న గిరిజన ఉత్పత్తులను పెంచి, మార్కెటింగ్ చేయడా నికి అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏపీవో చిన్నబాబు మాట్లాడుతూ మూసిన వీడీవీకేలను మళ్లీ తెరిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఐటీడీఏ ద్వారా మైక్రో ప్రాజెక్టు రుణాలను ఇచ్చేందుకు చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీడీ సన్యాసిరావు, డీపీఎం ఆర్‌వీ రమణ, టీఎస్‌పీ మండలాల ఏపీఎంలు పాల్గొన్నారు.

చేపల పెంపకంతో గిరిజనులకు ఆదాయం

సీతంపేట గిరిజన ప్రాంతాల్లో మత్స్య సంపద ద్వారా ఆదివాసీ కుటుంబాలకు అదనపు ఆదాయం సమకూర్చవచ్చునని ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు, నాబార్డు డీడీఎం దినేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా గురువారం వాసన్ సంస్థ ఆధ్వర్యంలో నౌగూడ గ్రామంలో ఆదివాసీ మత్స్యకార రైతులతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. వాసన్ సంస్థ చేపడుతున్న ఇంట్రిగేటెడ్ ఫార్మింగ్ మోడల్‌లో భాగమైన నాటుకోళ్ల పెంపకం షెడ్లను ప్రారంభించారు. నౌగూడ గ్రామంలోని చెరువులో చేపలను విడిచిపెట్టారు.

దుకాణం దగ్ధం

మక్కువ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నంద గ్రామంలో బుధవారం అర్ధరాత్రి షార్టు సర్క్యూట్‌తో వారణాసి వెంకటేష్‌కు చెందిన కిరాణా దుకాణం దగ్ధమయ్యింది. అగ్నికీలలు ఎగిసిపడి దుకాణం పక్కనే ఉన్న రాము పెంకిటిల్లు కొంతమేర కాలిపోయింది. సుమారు రెండు లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్టు అంచనా వేస్తున్నారు.

కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్‌గా మధుసూదనరావు

గరుగుబిల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కొప్పల వెలమ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన అక్కేన మధుసూదనరావు గురువారం విజయవాడ గొల్లపూడి బీసీ సంక్షేమశాఖ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం స్థానిక టీడీపీ ప్రతినిధులు అంబటి రాంబాబు, మర్రాపు పురుషోత్తంనాయుడు, ముదిలి బాబు విజయ వాంకుశం, డొంకాడ రామకృష్ణ, మరడాన సింహాచలం, కోట భరత్‌కుమార్, మరడాన నారాయణస్వామి, అంబటి రామకృష్ణ ఆయన్ని సన్మానించారు.

పది నెలల బకాయిలు చెల్లించండి

● గ్రీన్ అంబాసిడర్ల నిరసన



నిరసన తెలుపుతున్న గ్రీన్ అంబాసిడర్లు

సీతానగరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తమకు చెల్లించాల్సిన పది నెలల బకాయిలను తక్షణమే చెల్లించాలని గ్రీన్ అంబాసిడర్లు కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి యమ్మల మన్మథరావు, మండల కార్యదర్శి గవర వెంకటరమణ మాట్లాడు తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2015లో స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా గ్రీన్ అంబాసిడర్లను నియమించా యని చెప్పారు. మొదట్లో వీరికి స్వచ్ఛభారత్ కార్పొరే షన్ ద్వారా జీతాలు చెల్లించేవారని, తర్వాత పంచాయతీలకు అప్పగించడంతో వీరికి కష్టాలు మొదలయ్యాయన్నారు. పంచాయతీలు సక్రమంగా జీతాలు చెల్లించడం లేదన్నారు. గ్రీన్ అంబాసిడ్ల వేతనాలు చెల్లించని ఎడల భవిష్యత్తులో రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్ల మండల అధ్యక్షుడు జలుమూరు గౌరు, గుంట పోలయ్య, తోట రాము, తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ వర్కర్ల ఆందోళన



పాలకొండ: ఎంఈవోకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

సీతానగరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బందికి ప్రభుత్వం బకాయిపడిన ఐదు నెలల వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకురాలు వై.శాంతికుమారి డిమాండ్ చేశారు. గురువారం మండల విద్యా వనరుల కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అసంఘటిత కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేతన బకాయిలతో పాటు రెండు జతల యూనిఫారాలు ఇవ్వాలని, గుర్తింపు కార్డులు అందించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, సబ్బులు, గ్లౌజులు, కొబ్బరినూనె సరఫరా చేయాలన్నారు. అనంతరం ఎంఈవో సూరిదేముడుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ వర్కర్లు అనూష, గౌరమ్మ, సత్యవతి, సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

● పాలకొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లకు బకాయి వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక ఎంఈవో కార్యాలయం ఎదుట వారితో ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంఈవోకు వినతిపత్రం అందించారు. యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

● బలిజిపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్కూల్ శానిటేషన్ వర్కర్స్ (ఆయా) పెండింగ్ జీతాలు ఇవ్వాలని యూనియన్ నాయకురాలు లక్ష్మమ్మ, సీఐటీయూ నాయకులు తులసి, రజని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎంఈవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపి, కార్యాలయ సబార్డినేట్ భద్రాకు వినతిపత్రం అందించారు.

ఎన్‌పీసీఐ లింక్ చేయించాలి

వీరఘట్టం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందాలంటే లబ్ధిదారులు తపాలా శాఖ ద్వారా ఎన్‌పీసీఐ లింక్ చేసుకోవాలని ఎంపీడీవో బి.వెంకటరమణ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఏపీవో జి.సత్యం నాయుడు, ఏపీఎం కె.రాము, వీరఘట్టం సబ్ పోస్టుమాస్టర్ ఎస్.కృష్ణ, పోస్టుమేన్ టి.రవిబాబు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

పార్వతీపురంటౌన్, నవంబరు21(ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీలో గత కొన్నేళ్లుగా వేధిస్తున్న తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు ప్రారంభించారు. పైపులైన్ల లీకులు కారణంగా పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం ఎట్టకేలకు సమస్య పరిష్కారానికి సిద్ధమయ్యింది. తాగునీటి సరఫరా, లీకుల మరమ్మతులకు సంబంధించి పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు తెలిపారు.

'తోటపల్లి' ఫల సాయానికి వేలం ఖరారు

పార్వతీపురంటౌన్, నవంబరు21(ఆంధ్రజ్యోతి): తోటపల్లి హెడ్ వాటర్ వర్క్స్ పరిధిలో ఉన్న జీడిమామిడి, కొబ్బరి తదితర ఫల సాయానికి బహిరంగ వేలం ఖరారు అయ్యింది. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ శ్రీనివాసరాజు పర్యవేక్షణలో ఆర్వో రూబేను వేలం నిర్వహించారు. సర్కారు వారి పాట రూ.2.70 లక్షలుగా నిర్ణయించారు. బొత్స లక్ష్మి, వై.సూరప్పమ్మ బహిరంగ వేలంలో పోటీ పడ్డారు. చివరకు సూరప్పమ్మ వేలాన్ని దక్కించుకుంది. ఈసందర్భంగా సూరప్పమ్మకు కమిషనర్, ఆర్వోలు ధ్రువీకరణ పత్రాన్ని అందించారు.

ధాన్యం కొనుగోలు ఎప్పుడో?

బెలగాం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు ధాన్యం కొనుగోలు చేపట్టకపోవడం అన్యాయమని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక సుందరయ్య భవనంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఇంతవరకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు దళారులకు ధాన్యం విక్రయించి నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 26లోపు ధాన్యం కొనుగోలు చేయకపోతే 27న ఎమ్మార్వో, కలెక్టర్ కార్యాలయాల వద్ద ఆందోళన చేపడతామన్నారు. రైతు సంఘం నాయకుడు బంటు దాసు పాల్గొన్నారు.

డీఎస్సీ నుంచి మినహాయింపు ఇవ్వాలి

బెలగాం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ, గురుకుల పాఠశాల, కళాశాలలో అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల పోస్టులను డీఎస్సీ నుంచి మినహాయించా లని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్ డిమాండ్ చేశారు. గురువారం అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు రెండో రోజు ఐటీడీఏ వద్ద చేపట్టిన నిరసన దీక్షకు యూటీఎఫ్ మద్దతు తెలిపింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులను కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రమేష్, దివాకర్, రాజేష్, వెంకట్, అరసాడ రమేష్, రాయల వెంకట్, గిరిజన సంఘం నాయకుడు రంజిత్ పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించాలి

గుమ్మలక్ష్మీపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సచివాలయాలు ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సచివాలయాల జిల్లా ప్రత్యేక అధికారి రాంగోపాల్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయాల కార్యదర్శులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గుమ్మలక్ష్మీపురం ఎంపీడీవో సాల్మన్‌రాజ్, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

భామిని, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): భామిని, గురండి సబ్‌స్టేషన్ పరిధిలో బత్తిలి ఫీడర్ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. బత్తిలి, మనుమకొండ, పాలవలస, కాట్రగడ, బొమ్మిక తదితర గ్రామాలకు సరఫరా ఉండదని చెప్పారు.